## వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రం ప్రారంభం

**వినుకొండ(నూజెండ్ల):** ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) ఆధ్వర్యంలో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని తహసీల్దార్ ఎస్.సురేష్ ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు, కూరగాయలు తినడం వలన పౌష్టికాహారం లభిస్తుందని, అనేక జబ్బుల నుంచి కాపాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనర్ వల్లెపు తిరుపతి రావు, పిట్టంబండ యూనిట్ ఇన్‌చార్జి అబ్బూరి శివలక్ష్మి, కారుమంచి యూనిట్ ఇన్‌చార్జి లక్ష్మీదుర్గ, సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ స్విమ్మింగ్ పోటీలకు జగదీష్

**నరసరావుపేట ఈస్ట్:** జాతీయస్థాయి స్విమ్మింగ్ (ఈత) పోటీలకు శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి ఎస్.జగదీష్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధు సూదనరావు సోమవారం తెలిపారు. విజయవాడలో నిర్వహించిన 38వ జాతీయ క్రీడలలో పాల్గొనే ఏపీ పురుషుల స్విమ్మింగ్ టీం ఎంపిక పోటీలలో జగదీష్ ప్రతిభ కనపరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడని వివరించారు. ఉత్తరాఖండ్‌లో ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో జగదీష్ రాష్ట్రజట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని స్పష్టం చేశారు. జగదీష్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, ప్రిన్సిపల్ డాక్టర్ సుధీర్, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, అధ్యాపకులు అభినందించారు.

## వీధి శునకాల పట్టివేత



**శావల్యాపురం:** స్థానిక పంచాయతీ ఆధ్వర్యంలో వీధి కుక్కల పట్టివేత కార్యక్రమం సోమవారం చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి బోడ్డు యాకోబు తెలిపారు. గ్రామస్తులు ఫిర్యాదు మేరకు పంచాయతీ నిధులతో ప్రకాశం జిల్లా మార్టురు చెందిన టీం సభ్యులు గ్రామంలో ఉన్న కుక్కలను పట్టుకొని ప్రత్యేక వాహనంలో కుక్కలను బంధించి అడవిలోకి వదిలి పెడతామన్నారు. ఒక్కో కుక్కకు రూ. 200 రూపాయల చొప్పున 110 కుక్కలను పట్టుకున్నారని వాహనానికి అదనంగా రూ. 5 వేలు ఇచ్చినట్లు తెలిపారు.

## పోరాటాలకు సిద్ధం కావాలి

**చిలకలూరిపేట:** నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటాలకు యువత సంసిద్ధం కావాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సుబాని పిలుపు నిచ్చారు. అఖిల భారత యువజన సమాఖ్య నియోజకవర్గ స్థాయి సమావేశం, నూతన కార్యవర్గ ఎంపిక పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ముందుగా ఏఐవైఎఫ్ పతకాన్ని సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలింభిస్తున్న విధానాల వల్ల నిరుద్యోగుల సంఖ్య నానాటికి పెరిగిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా చౌటుపల్లి చినబాబు, కార్యదర్శిగా కె మల్లిఖార్జున్, పట్టణ కన్వీనర్‌గా బి.రాంబాబు, కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు జంగాల చైతన్య, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## దాబాకు మద్యం సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

**వినుకొండ(నూజెండ్ల):** పట్టణంలోని నూజెండ్ల రోడ్డులోని ఎస్ఆర్ దాబాలో ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం సప్లయి చేస్తున్న రావుల సాయికృష్ణ అనే వ్యక్తిని అరెస్ట్ చేయడం జరిగిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది తెలిపారు. అతని వద్ద ఉన్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. రోడ్డు పక్కన ఉండే దాబాలకు ఎలాంటి మద్యం సరఫరాకు అనుమతులు లేవని, అక్కడ మద్యం తాగినా, తాగించినా నేరంగా పరిగణించి చర్యలు ఉంటాయన్నారు.

## 8న సంక్రాంతి ముగ్గుల పోటీలు

**వినుకొండ(నూజెండ్ల):** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 8వ తేదీ బుధవారం ఉదయం 10.30గంటలకు ఇంటర్మీడియట్ కళాశాలల స్థాయి సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మాత్రమే టీంగా ఇందులో పాల్గొనవచ్చని, గెలుపొందిన విజేతలకు బహుమతులు ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9290930917, 9491948154 నంబర్లను సంప్రదించాలన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

**వినుకొండ(నూజెండ్ల):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో 4 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించగా 31 మంది అభ్యర్థులు హాజరుకాగా 10 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాసరావు తెలిపారు. సంస్థ సిబ్బంది ఎం. వీరాంజనేయులు, జె.సురేష్, వినుకొండ స్కిల్ హబ్ కోఆర్డినేటర్ డి.జానీ బాషా, సీడాప్, జేఆర్‌పీఎస్ లక్ష్మి, రామయ్య, కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు, శివఫణీంద్ర, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్ల మరమ్మతు పనులు పూర్తి చేయాలి

**చిలకలూరిపేట:** రోడ్ల మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేయా లని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలలో రూ. 10 లక్షలతో నిర్వహిస్తున్న రోడ్ల మరమత్తు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి నాటికి రోడ్లపై ఎక్కడా గుంతలు లేకుండా అన్ని పనులు పూర్తి చేయాలని చెప్పారు. నిర్దేశిత సమయానికి కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసేలా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందన్నారు. పట్టణంలోని 29, 35, 36 వార్డుల్లో జరుగుతున్న రోడ్ల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, డీఈఈ షేక్ అబ్దుల్ రహీం, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## పిచ్చిమొక్కల తొలగింపు



గణపవరం సింగువారివీధిలో పిచ్చిమొక్కలు తొలగించాక విద్యుత్ స్తంభం

సాక్షి ఎఫెక్ట్

**నాదెండ్ల:** మేజర్ పంచాయతీ గణపవరం సింగువారవీధిలో ఓ విద్యుత్ స్తంభానికి పిచ్చిమొక్కలు అల్లుకుని ప్రమాదభరితంగా మారిందంటూ సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన అల్లుకున్న నిర్లక్ష్యం కథనానికి విద్యుత్ ఏఈ ప్రసాద్ స్పందించారు. సోమవారం ఉదయం ఆ శాఖ సిబ్బంది స్తంభం ఎక్కి అల్లుకున్న పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# అభివృద్ధి పథంలో నరసరావుపేట

- విద్యా, వ్యాపార రంగాల్లో అగ్రగామి
- పల్నాడు జిల్లా కేంద్రంగా ఖ్యాతి

**నరసరావుపేట:** అట్లూరు అనే కుగ్రామంతో ప్రారంభమై జమిందారు రాజామల్రాజు నరసింగరాయని బహద్దూరు పేరుపై నరసరావుపేట పట్టణం 228 ఏళ్ల క్రితం ఏర్పడింది. గేట్‌వే ఆఫ్ పల్నాడుగా అనాది నుంచి ప్రసిద్ధిగాంచింది. 1915లో నరసరావుపేట పురపాలకసంఘం ఏర్పడి 1981లో మొదటిసారి ఎన్నికలు జరిగి పాలకవర్గం ఏర్పడింది. ప్రస్తుతం పట్టణం 14 కిలోమీటర్ల వ్యాసార్థంతో నాలుగువైపులా విస్తరించి 38 వార్డుల పరిధిలో 33 వేలకు పైగా గృహాల్లో 1.60 లక్షల మంది జనాభాతో విలసిల్లుతోంది. 1997లో పట్టణ ద్విశతాబ్ది ఉత్సవాలను కూడా నిర్వహించుకోవటం జరిగింది. పుర పాలక సంఘం ఏర్పడి 2015 నాటికి వందేళ్లు పూర్తిచేసుకొని నేటికి 110 సంవత్సరంలో అడుగిడింది. 1915లో పురపాలక సంఘంగా ఏర్పడిన పట్టణం 1980 లో ఫస్ట్ గ్రేడు పురపాలకసంఘం ఎదిగింది. కాలానుగుణంగా పల్నా డు రోడ్డు, స్టేషన్‌రోడ్డు, సత్తెనపల్లి, వినుకొండ, గుంటూరు రోడ్లు, కోటప్పకొండరోడ్లలో సెంట్ర ల్ డివైడర్లు, లైటింగ్ ఏర్పాటుతో విద్యుత్ శోభను సంతరించుకుంది. పట్టణం రాజకీయంగాను, విద్యాకేంద్రంగా, వ్యాపారం కేంద్రంగా దినదినాభివృద్ధి చెందు తూ 2022 నాటికి పల్నా డు జిల్లా కేంద్రంగా రూపుదిద్దుకుంది. అనేక హోల్ సేల్ షాపులు ఏర్పడి ఇక్కడి నుంచి ఆరోగ్యానికి ఉపయోగించే డ్రగ్స్ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేయబడుతున్నాయి. పట్టణంలో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలతో పాటు పలు ప్రైవేటు ఇంజినీరింగ్, ఫార్మసీ, పీజీ, డిగ్రీ, ఇంటర్ కళాశాలలతో వేలాది మంది విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నాయి. మొదటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటైంది. అలాగే ప్రభుత్వం, ప్రైవేటు కార్పొరేట్ యాజమాన్యాల ఆధ్వర్యంలో వేలాదిమంది పిల్లలకు కాన్వెంట్లు, పాఠశాలలు విద్యాబోధన అందజేస్తున్నాయి. 1960 లో ఏర్పాటైన ఎస్ఎస్ఎన్ కళాశాల గత 65 ఏళ్లుగా రాయలసీమ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పల్నాడు జిల్లాలోని వేలాది మంది విద్యార్థులకు ఇంటర్, డిగ్రీలలో చదువులు నేర్పింది. పట్టణంలో ఆరేళ్ల క్రితం ప్రతిష్టాత్మకమైన జేఎన్‌టీయూ కళాశాల ఏర్పాటైంది. అలాగే లింగంగుంట్ల కాలనీలో 200 పడకల హాస్పిటల్ ఏర్పాటై ప్రతిరోజూ వందలాది మందికి ఆరోగ్య సమస్యలు తీరుస్తోంది. అక్కడే జిల్లా కలెక్టరేట్, జిల్లా ఎస్పీ కార్యాల యాలు, పట్టణం మొత్తం పలు విభాగాలకు చెందిన జిల్లా కార్యాలయాలు ఏర్పాటై జిల్లా కేంద్ర శోభను సంతరించుకున్నాయి. పట్టణానికి నాలుగువైపులా విశాలమైన రోడ్లు ప్రజల రాకపోకలకు అనువుగా ఏర్పాటై పట్టణాభివృద్ధికి దోహదం చేస్తున్నాయి. అధికారులు, నేతల సారథ్యంలో పట్టణం ముందుకు వెళుతోంది.



పట్టణ ఏరియల్ వ్యూ



నాడు-నేడులో ఆధునీకరించిన ప్రకాష్ నగర్‌లోని తిలక్ మున్సిపల్ స్కూలు

